
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం । 26 । మే । 2024



సోమశిలలో 7.565 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారానికి 7.565 టీఎంసీల నీరు ఉంది. పెన్నార్‌డెల్టాకు 200, ఉత్తర కాలువకు 5, దక్షిణ కాలువకు 5 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.74,060
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.6,633
3 శాతం జీఎస్టీతో	రూ.6,832
నవర (8 గ్రా)	రూ.54,656



అత్తారింటికి లక్ష్మీనరసింహుడు

పెంచలకోన క్షేత్రంలో బ్రహ్మోత్సవాల్లో కల్యాణం తర్వాత సంప్రదాయంగా స్వామి పెనుశిల లక్ష్మీనరసింహుడు శనివారం గోనుపల్లిలో అత్తారింటికి చేరుకున్నాడు.

8లో

న్యూస్‌రీల్

పది పరీక్షలకు 941 మంది గైర్హాజరు

నెల్లూరు(టౌన్): జిల్లాలో జరుగుతున్న పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షకు సంబంధించి రెండో రోజు శనివారం హిందీ పరీక్ష జరిగింది. మొత్తం 1,090 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా కేవలం 149 మంది మాత్రమే హాజరయ్యారు. 941 మంది గైర్హాజరయ్యారు. డీఈఓ రామారావు రెండు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, అధికారులు కలిపి మొత్తం 18 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

ఊరూరా పోలీసుల జల్లెడ

- కార్డన్ సెర్చ్‌లో 80 బైక్‌లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనాలతో ఉదయగిరి సీఐ గిరిబాబు తదితరులు

నెల్లూరు (క్రైమ్): జిల్లాలో పోలీసులు ఊరూరా జల్లెడ పట్టుతున్నారు. నెల్లూరు నగరంలోని బాలాజీనగర్, నెల్లూరురూరల్ పోలీసుస్టేషన్‌తో పాటు సంగం, అనంతసాగరం, సోమశిల, ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు, కలువాయి, బిట్రగుంట, జలదంకి, రాపూరు, కలిగిరి పోలీసుస్టేషన్ల పరిధిలోని సమస్యాత్మక, శివారు ప్రాంతాల్లో శనివారం పోలీసు అధికారులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటిని జల్లెడ పట్టారు. ఇంట్లో ఎవరెవరు నివాసం ఉంటున్నారు? ఏం చేస్తున్నారు? తదితర వివరాలను సేకరించారు. రికార్డులు లేని 80 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌లకు తరలించారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని ప్రజలను హెచ్చరించారు.

పకడ్బందీగా ఓట్ల లెక్కింపు

ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్

- 8:30 నుంచి ఈవీఎంల్లో ఓట్ల లెక్కింపు
- జిల్లాకు నలుగురు అబ్జర్వర్లు

సార్వత్రిక ఎన్నికల ఆఖరి ఘట్టం మాత్రమే మిగిలింది. ప్రధాన పార్టీలు ఇప్పుడు ఓట్ల లెక్కింపు కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నాయి. జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. అయితే ఓట్ల లెక్కింపునకు ఎన్ని టేబుల్స్ ఉంటాయి.. ఎంత మంది ఏజెంట్లను నియమించుకోవాల్సి ఉంటుందనే అంశాలపై ఇప్పటికే ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకు రిటర్నింగ్ అధికారులు తెలియజేశారు. కౌంటింగ్ ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో ఇతర అధికారులకు శిక్షణ ప్రారంభించారు. కౌంటింగ్ చేపట్టే సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఓట్ల లెక్కింపులో జాగ్రత్తలు, ఏర్పాట్లు తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్‌తో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ.

– సాక్షి ప్రతినిధి, నెల్లూరు

ప్ర: గత ఎన్నికల్లో కంటే అధిక శాతం పోలింగ్ నమోదైంది. అందుకు ఏం చర్యలు చేపట్టారు

జ: ఎన్నికల నిబంధనల మేరకు ఓటర్ల జాబితా పకడ్బందీగా తయారు చేశాం. స్వీప్ కార్యక్రమం, డిజిటల్ ప్రచారానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాం. అందులో భాగంగా యూ ట్యూబ్, ఫేస్‌బుక్, వాట్సాప్‌లో విస్తతంగా ప్రచారం చేశాం. ప్రతి ఒక్క ఓటరుకి ఓటరు స్లిప్‌తో పాటు అవగాహన కల్పించాం. గిరిజన ప్రాంతాల్లో అవగాహన సదస్సులు పెట్టి చైతన్య వంతం చేశాం.

ప్ర: ఈవీఎంల భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు

జ: జిల్లాలోని 8 అసెంబ్లీ, ఒక పార్లమెంట్‌కు జరిగిన పోలింగ్‌కు సంబంధించి ఈవీఎంలను నెల్లూరులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరిచాం. ఈవీఓంలకు మూడంచెల బందోబస్తు ఏర్పాటు చేశాం. స్థానిక పోలీసులు, స్పెషల్ ఫోర్స్, ఆర్మీ పోలీసులు మూడంచెలుగా విధుల్లో ఉంటారు. స్ట్రాంగ్ రూమ్‌లను 130 పైగా సీసీ కెమెరాల పర్యవేక్షిస్తున్నాం. కౌంటింగ్ రోజు వరకు నిరంతరం నిఘా ఉంటుంది. కౌంటింగ్ కేంద్రంపై డ్రోన్లు ఎగరకుండా రెడ్‌జోన్‌గా ప్రకటించాం.

ప్ర: కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేసేందుకు ఎలాంటి ఏర్పాట్లు చేశారు

జ: పకడ్బందీగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపడుతున్నాం. పారదర్శకంగా, అప్రమత్తంగా చేపట్టేందుకు పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉన్నాం. నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గానికి 14 మంది, 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు 115 మంది బరిలో నిలిచారు. జిల్లాలో మొత్తం 19,44,285 ఓట్లు ఉండగా, 15,48,183 ఓట్లు పోలయ్యాయి. అత్యధికంగా కోవూరు నియోజకవర్గంలో 324 పోలింగ్ బూత్‌లు, అత్యల్పంగా నెల్లూరు సిటీ నియోజకవర్గంలో 248 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ముందుగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతోంది. ఇందు కోసం నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు 14 టేబుళ్లు, నెల్లూరు రూరల్‌కు 6 టేబుళ్లు ఏర్పాటు చేశాం. మిగిలిన నియోజకవర్గాలకు 2 టేబుళ్లు ఏర్పాటు చేశాం. ఈవీఎంల్లో ఓట్ల లెక్కింపు 8.30 గంటల నుంచి ప్రారంభమవుతుంది. ప్రతి అసెంబ్లీ స్థానానికి 14 టేబుళ్ల వంతున ఈవీఎంల లెక్కింపు జరుగుతోంది. వెయ్యి మంది సిబ్బందితో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ప్రతి టేబుల్‌కు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఉంటారు. వాళ్లు తుది నిర్ణయం తీసుకుంటారు.



జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్

ప్ర: ఫలితాల ప్రకటన ఎలా ఉంటుంది


జ: 14 టేబుళ్ల ఒక రౌండ్‌గా నిర్ణయించాము. ప్రతి టేబుల్‌కు ఒక ఈవీఎం లెక్కన కేటాయించి లెక్కింపు చేస్తారు. ప్రతి రౌండ్‌కు మెజార్టీలను వెల్లడిస్తాం. జిల్లాలో ఓట్ల లెక్కింపునకు సంబంధించి నలుగురు పరిశీలకులను ఎన్నికల కమిషన్ నియమించింది. ప్రతి రౌండ్ ఓట్ల లెక్కింపును అబ్జర్వర్ సంతకం చేసిన తర్వాత మాత్రమే రౌండ్ల వారీగా ఫలితాలను ప్రకటిస్తాం.

ప్ర: కౌంటింగ్ రోజు భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు

జ: ఇందుకు సంబంధించి పోలీసు అధికారులకు ఇప్పటికే ఎన్నికల కమిషన్ సూచనలు చేసింది. కౌంటింగ్ కేంద్రానికి దూరంగా కనుపర్తిపాడు వద్దనే జనాలు ఉండిపోవాలి. కేవలం కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లను మాత్రమే కళాశాల వద్దకు అనుమతిస్తాం. ఏజెంట్లతో పాటు సిబ్బంది, అధికారులకు రిలీవర్స్, రిజర్వ్ సిబ్బంది అందరికీ పాస్‌లు ఏర్పాటు చేస్తున్నాం. వీరు తప్ప కౌంటింగ్ కేంద్రానికి ఎవరిని అనుమతించే ప్రసక్తే లేదు. ఇటీవల పోలింగ్ సమయంలో గొడవలు జరిగిన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాం. పోలీసులు కార్డన్ సెర్చ్ కూడా నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నారు.వాహనాలు, ఆయుధాలు గుర్తించి పోలీసులు సీజ్ చేస్తున్నారు. ఓట్ల లెక్కింపు అనంతరం గెలిచిన అభ్యర్థులు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించుకోవడానికి అనుమతులు లేవని ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు రాజకీయ పార్టీలు సహకరించాలి.

ప్ర: కేంద్రంలో అన్ని వసతులు ఏర్పాటు చేశారా?

జ: లెక్కింపు కేంద్రంలో వసతులు ఏర్పాటుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశాం. ఎన్నికల సిబ్బందితో పాటు, మీడియాకు తాగునీరు, భోజన వసతి ఏర్పాటు చేశాం.



మైపాడు బీచ్‌లో పర్యాటకులను హెచ్చరిస్తున్న మెరైన్ పోలీసులు

తీరంలో అలజడి

ఇందుకూరుపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా, ఆ తర్వాత శనివారం సాయంత్రానికి తుఫాన్‌గా మారింది. తుఫాన్‌కు 'రెమాల్' అని నామకరణం చేశారు. తుఫాన్ ప్రభావంగా తీరం వెంబడి అలలు ఎగిసి పడుతున్నాయి. పర్యాటకులతో పాటు మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. శనివారం ఉదయం నుంచి సముద్రం సాధారణంగా ఉంది. వారాంత సెలవు రోజు కావడంతో శనివారం వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు మైపాడు బీచ్‌కు తరలివచ్చారు. రాత్రి సమయంలో సముద్రం కసురుగా మారి అలలు ఎగిసి పడుతున్నాయి. తీరం వెంబడి గాలుల ప్రభావం కూడా పెరగడంతో, తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో మెరైన్ పోలీసులు మైపాడు సముద్ర తీరానికి వచ్చిన సందర్శకులను అప్రమత్తం చేస్తూ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయితే ప్రస్తుతం వేట నిషేధ సమయం కావడంతో మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లడం లేదు.

స్ట్రాంగ్‌రూమ్‌ల తనిఖీ



స్ట్రాంగ్‌రూమ్ పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూంలను కలెక్టర్ ఎం.హరినారాయణన్ శనివారం పరిశీలించారు. రోజువారి తనిఖీల్లో భాగంగా కనుపర్తిపాడులోని ప్రియదర్శిని కళాశాలలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలతో పాటు సీసీ టీవీల మానటరింగ్ చేస్తున్న కంట్రోల్ రూంను పరిశీలించారు. ఆయన వెంట జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్, అదనపు ఎస్పీ సౌజన్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 421 మంది గైర్హాజరు

నెల్లూరు (టౌన్): ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ డ్ సప్లిమెంటరీ పరీక్షలు శనివారం రెండో రోజు జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. ఉదయం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్‌కు జనరల్ విద్యార్థులు 9,635 మంది హాజరు కావాల్సి ఉండగా 9,214 మంది పరీక్షలు రాశారు. 421 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 271 మందికి గానూ 33 మంది పరీక్షకు హాజరు కాలేదు. మధ్యాహ్నం నుంచి ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షకు జనరల్ విద్యార్థులు 433 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 386 మంది హాజరయ్యారు. 47 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 113 మందికి గానూ 14 మంది గైర్హాజరయ్యారు. ఆర్ఐఓ 6 కేంద్రా లను, డీవీఈఓ 3 కేంద్రాలను, స్క్వాడ్ బృందం 32 కేంద్రాలను తనిఖీ చేశారు.

ప్రశాంతంగా ఏపీపీఎస్సీ పరీక్ష

- 62.61 శాతం అభ్యర్థులు పరీక్షలకు హాజరు

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టుల భర్తీ కోసం ఏపీపీఎస్సీ శనివారం ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్ష నిర్వహించింది.

ఇందు కోసం కావలిలో పీబీఆర్ విశ్వోదయ ఇంజినీరింగ్ కళాశాల, రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, కోవూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, పొట్టెపాళెం సమీపంలోని అయాన్ డిజిటల్ జోన్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 1,070 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 670 మంది హాజరు కాగా 400 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. 62.61 శాతం మంది పరీక్షకు హాజరైనట్లు అధికారులు తెలిపారు.

28 నుంచి కామాక్షితాయి బ్రహ్మోత్సవాలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో వెలసిన కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 28న అంకురార్పణతో ప్రారంభించనున్నామని ఈఓ గిరికృష్ణ తెలిపారు. ఈ మేరకు విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. 29న ధ్వజారోహణ, 30న శేషవాహనసేవ, 31న పురుషామృగ వాహనసేవ, జూన్ ఒకటిన సింహవాహనసేవ, రెండున హంసవాహనసేవ, మూడున రావణసేవ, నాలుగున వెండి నందిసేవ, ఐదున రథోత్సవం, ఆరున స్వామి, అమ్మవార్ల కల్యాణం, తెప్పోత్సవం, ఏడున ధ్వజావరోహణ, అలకలతోపు, ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయని వివరించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు.

డాక్టర్లకు షోకాజ్ నోటీసులు సిద్ధం

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న పలువురు డాక్టర్లకు షోకాజ్ నోటీసుల జారీకి వైద్య, ఆరోగ్య శాఖ ఉత్తర్వులను సిద్ధం చేస్తోంది. నెల్లూరులో 20, కావలిలో నాలుగు, కందుకూరులో రెండు, ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెంలో ఒకటి చొప్పున మొత్తం 28 పట్టణ ఆరోగ్య కేంద్రాలున్నాయి. వీటిలో పనిచేస్తున్న డాక్టర్లు సక్రమంగా విధులు నిర్వర్తించకపోవడం.. ఆస్పత్రికి వచ్చినా హాజరు వేసుకొని వెళ్లిపోతున్నారని తెలిసింది. ఈ క్రమంలో వీరికి షోకాజ్ నోటీసులను డీఎంహెచ్ఓ పెంచలయ్య జారీ చేసి వివరణ కోరనున్నారు. ఈ అంశాన్ని డీఎంహెచ్ఓ శనివారం ధ్రువీకరించారు.

అధికారుల తనిఖీలు



చేజర్ల: మండలంలోని మైపాటివారి కండ్రికలో గల ప్రభుత్వ భూముల్లో తెల్లరాయిని అక్రమంగా తవ్వి తరలిస్తున్నారనే సమాచారంతో మండల రెవెన్యూ, జిల్లా మైనింగ్ అండ్ జియాలజిస్ట్ అధికారులు తనిఖీలను శనివారం చేపట్టారు. గ్రామంలో తెల్లరాయి తవ్వకాలు జరుగుతున్న ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. అక్రమ మైనింగ్‌పై చర్యలు చేపడతామని చెప్పారు. ఆర్ఐ సుమతి, వీఆర్వో పెంచలయ్య పాల్గొన్నారు.

పరికరాల కోసం చెరువులోకి దిగి..

• మహిళ మృతి

ఉదయగిరి: ఉపాధి పనులకు అవసరమైన పరికరాల కోసం చెరువులోకి దిగి ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు ప్రమాదం నుంచి బయటపడిన ఘటన ఉదయగిరి కొత్త చెరువు వద్ద శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. స్థానిక కొత్త చెరువు ప్రాంతంలో జరుగుతున్న ఉపాధి పనులకు ఉదయగిరిలోని యాదవవీధికి చెందిన పెరుమాళ్ల వెంకటలక్ష్మి, ప్యారీ, వెంకటసుబ్బు కొద్దిరోజులుగా వెళ్తున్నారు. పనులకు ఉపయోగించిన పరికరాలను చెరువులో దాచారు. అయితే వర్షం రావడంతో చెరువులో నీరు చేరి పరికరాలు మునిగిపోయాయి. అప్పటి నుంచి ఉపాధి పనులు జరగలేదు. ఈ క్రమంలో పనులు ప్రారంభం కావడంతో ఈ ముగ్గురూ కొత్త చెరువు వద్దకెళ్లి పరికరాల కోసం నీటిలోకి దిగారు. పెద్ద గుంతలు తీసిన ప్రాంతంలో నీరు చేరడం, లోతును గ్రహించలేక వీరు మునిగిపోయారు. దీంతో పెరుమాళ్ల వెంకటలక్ష్మి (40) మునిగిపోగా, మిగిలిన ఇద్దరూ బయటపడి పెద్దగా కేకలేశారు. పక్కనే ఉపాధి పనులు చేస్తున్న కూలీలు ఘటన స్థలానికి వచ్చి వెంకటలక్ష్మిని బయటకు తీసి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందారని వైద్యులు నిర్ధారించారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సీఐ గిరిబాబు, ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి పరిశీలించారు. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని ఇంటికి తరలించారు. యాదవవీధిలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



చెరువును పరిశీలిస్తున్న పోలీసులు



వెంకటలక్ష్మి మృతదేహం

గోనుపల్లి చేరిన నృసింహుడు



రాపూరు: మండలంలోని పెంచలకోనలో ఆరు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరుపుకొన్న అనంతరం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, చెంచులక్ష్మి గోనుపల్లి గిరిజన కాలనీకి చేరుకున్నారు. ఇందులో భాగంగా కోనలోని అలంకార మండపం వద్ద స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో కొలువుదీర్చి వివిధ పుష్పాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం బోయలు కాలినడకన గోనుపల్లికి బయల్దేరారు. ఈ సందర్భంగా గిరిజనులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవాన్ని జరిపారు.

వేడుకగా చక్రస్నానం



నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని చప్పరోత్సవం, గిరి ప్రదక్షిణ, చక్రస్నానం, ధ్వజావరోహణను శనివారం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. దేవదాయ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు, ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఒకటి నుంచి రాష్ట్రస్థాయి ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఎఫ్ 2 బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో జూన్ 1, 2వ తేదీల్లో రాష్ట్ర స్థాయి ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీని నిర్వహించనున్నారని ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ తెలిపారు. టోర్నీ వాల్ పోస్టర్లను తన కార్యాలయంలో శనివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇలాంటి పోటీలను నిర్వహించడం ద్వారా క్రీడాకారులు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించేందుకు ఒక మంచి అవకాశమన్నారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సహకారంతో పోటీలను నిర్వహిస్తున్న ఎఫ్ 2 బ్యాడ్మింటన్ అకాడమీ నిర్వాహకులను అభినందించారు. జిల్లాలో బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి తమ సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్, టోర్నీ నిర్వాహకులు ప్రభు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ద్వారకానాథ్ తదితరులు

నిమ్మ ధరలు పొదలకూరు (కిలో)

పెద్దవి	: రూ.70
సన్నవి	: రూ.35
పండ్లు	: రూ.25

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.172
లేయర్ లైవ్	రూ.120
బ్రాయిలర్ చికెన్:	రూ.300
స్కిన్‌లెస్ చికెన్:	రూ.330
లేయర్ చికెన్:	రూ.204

ఆధ్యాత్మికం మాటున అశ్లీలం

- సాంస్కృతిక నృత్యాల పేరుతో రికార్డింగ్ డ్యాన్స్‌లు
- టీడీపీ నేతలు కోరితే అనుమతులు
- మిగిలిన వారడిగితే పోలీస్ యాక్ట్ 30 అంటూ అభ్యంతరం

ఆత్మకూరు: ఎన్నికల వేళ పోలీస్ వ్యవస్థ మరీ బరితెగించింది. అధికారం కోసం తల్లడిల్లుతున్న టీడీపీ నేతలు సాగించే అరాచకాలు, అసాంఘిక కార్యకలాపాలకు పోలీసులు వత్తాసు పలుకుతున్నారు. ఓ వైపు ఎన్నికల కోడ్‌తో పాటు పోలీస్ యాక్ట్ 30 అమల్లో ఉంది. ఈ తరుణంలో గ్రామాల్లో ఉత్సవాల పేరిట అశ్లీల నృత్యాలతో టీడీపీ నేతలు అశాంత వాతావరణాన్ని నెలకొల్పుతున్నారు. ఆత్మకూరు, మర్రిపాడు, ఏఎస్‌పేట ప్రాంతాల్లో దైవ ఉత్సవాల్లో ఆధ్యాత్మికం మాటున అశ్లీల నృత్యాలను టీడీపీ నేతలు నిర్వహిస్తున్నారు. దశాబ్దాల క్రితమే నిషేధించిన అశ్లీల నృత్యాలు (రికార్డింగ్ డ్యాన్స్‌లు)కు ఆత్మకూరు డివిజన్ పోలీస్ యంత్రాంగం అధికారికంగా అనుమతులిస్తోంది. సాంస్కృతిక కార్యక్రమాలకు అనుమతులివ్వాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కోరినా ససేమిరా అంటున్న పోలీసులు.. టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించే అశ్లీల నృత్యాలను చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆత్మకూరు మండలం అరవేడు జంగాలపల్లిలో రాములోరి ఉత్సవాల ముగింపు సందర్భంగా సాంస్కృతిక నృత్యాలకు శుక్రవారం రాత్రి అనుమతులు పొందిన టీడీపీ వారు అర్ధ రాత్రి సమయంలో అశ్లీల నృత్యాలు వేశారని గ్రామస్తులు తెలిపారు. గడిచిన వారం వ్యవధిలో ఏఎస్‌పేట మండలం గుంపర్లపాడు, అక్బరాబాద్, తెల్లపాడు గ్రామాల్లో అశ్లీల నృత్యాలను విచ్చలవిడిగా వేశారని గ్రామస్తులు ఆరోపించారు. తెల్లపాడులో గ్రూప్ డ్యాన్స్‌లను విచ్చలవిడిగా చేశారని, దీనిపై పోలీసులకు ఫోన్ చేస్తే పూర్తి స్థాయిలో సిబ్బంది లేరని సమాధానం చెప్పారని గ్రామస్తులు పేర్కొన్నారు. గుంపర్లపాడులో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలను అడ్డుకొని విద్యుత్ వైర్లు, ఫ్యూజ్ లింకులను సైతం పోలీసులు తీసుకెళ్లారు. ఈ క్రమంలో మరుసటి రోజు టీడీపీ ఆధ్వర్యంలో అర్ధరాత్రి నిర్వహించిన అశ్లీల నృత్యాలపై సమాచారం పోలీసులకు తెలియదానని గ్రామస్తులు ప్రశ్నించారు. ఈ విషయమై ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డిని సంప్రదించగా.. పోలీస్ యాక్ట్ 30, ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, ఇలాంటి పరిస్థితుల్లో నృత్య ప్రదర్శనలకు అనుమతులివ్వడంలేదని చెప్పారు. పలు గ్రామాల నుంచి నిర్వాహకులు అనుమతులు కోరిన మాట వాస్తవమేనని, అయితే ఎవరికీ మంజూరు చేయలేదన్నారు. గ్రామాల్లో మైకుల్లేకుండా ఇలాంటి డ్యాన్స్‌లను నిర్వహిస్తున్నారనే విషయమై పూర్తి స్థాయిలో విచారణ చేస్తామని పేర్కొన్నారు.

పశుగ్రాసంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న మహేశ్వరుడు

ఉదయగిరి: జిల్లాలో పశుగ్రాసానికి కొరత ఉన్న తరుణంలో వీటి పెంపకంపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని జేడీ మహేశ్వరుడు కోరారు. పట్టణంలోని ఆర్బీకే – 1లో పశుసంవర్ధక శాఖ అధికారులు, సిబ్బంది, రైతులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలకరి వర్షాలు త్వరలో కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని కోరారు. పశువులకు వ్యాధులు సోకే అవకాశం ఉండటంతో టీకాలను వేయాలని సూచించారు. వివిధ రాయితీలు, పథకాలు రైతులకు అందేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కావలి, కందుకూరు డీడీలు రమేష్‌కుమార్, చంద్రశేఖర్, ఏడీలు శశిధర్, రఘునాథ్, సురేష్, మంగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.